ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

- పట్టభద్రుల స్థానానికి 21 కేంద్రాల్లో పోలింగ్
- టీచర్ స్థానానికి 13 పోలింగ్ కేంద్రాలు
- మండల కేంద్రాల్లోనే పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు



మడకశిర: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో టీచర్, పట్టభద్రుల స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 13న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సజావుగా ఈఎన్నికలను నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు

ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ మూడు నియోజకవర్గాల్లో మొత్తం 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పట్టభద్రుల స్థానానికి 21 పోలింగ్ కేంద్రాలు, టీచర్ స్థానానికి 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు నిర్ణయించారు. మడకశిర నియోజకవర్గంలో పట్టభద్రుల స్థానానికి అగళి, రొళ్ల , గుడిబండ, అమరాపురం మండల కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మడకశిరలో మాత్రం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల విభాగం అధికారులు తెలిపారు. అదే విధంగా టీచర్ స్థానానికి అన్ని మండల కేంద్రాల్లో కూడా ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో పట్టభద్రులకు 8 పోలింగ్ కేంద్రాలు, టీచర్ స్థానానికి 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అలాగే పెనుకొండ నియోజకవర్గంలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పట్టభద్రులకు 7 పోలింగ్ కేంద్రాలు, టీచర్ల స్థానానికి 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఓటరుగా నమోదు చేసుకున్న పట్టభద్రులు 4,055 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 2,983, మహిళా ఓటర్లు 1,072 మంది ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 204 మంది ఉండగా.. పురుషులు 157 మంది, మహిళా ఓటర్లు 47 మంది ఉన్నారు. హిందూపురం నియోజకవర్గంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 5,718 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 3,665 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 2,053 మంది ఉన్నారు. టీచర్ ఓటర్లు మొత్తం 785 మంది ఉండగా ఇందులో పురుష ఓటర్లు 467, మహిళా ఓటర్లు 318 మంది ఉన్నారు. అలాగే పెనుకొండ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 6,065 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 4,120 మంది, మహిళా ఓటర్లు 1,942 మంది ఉన్నారు. ఇతరులు ముగ్గురు ఉన్నారు. టీచర్ ఓటర్లు మొత్తం 376 మంది ఉండగా పురుష ఓటర్లు 266 మంది, మహిళా ఓటర్లు 110 మంది ఉన్నారు.

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు

పట్టభద్రుల ఓటర్లు	15,838
పురుష ఓటర్లు	10,768
మహిళా ఓటర్లు	5,067
ఇతరులు	03
ఉపాధ్యాయ ఓటర్లు	1,365
పురుష ఓటర్లు	890
మహిళా ఓటర్లు	475
పట్టభద్రుల స్థానానికి పోలింగ్ కేంద్రాలు	21
టీచర్ స్థానానికి పోలింగ్ కేంద్రాలు	13

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా నిఘా ఉంచాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

- మారుతీప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్, మడకశిర

క్లుప్తంగా

సీఎంకు రుణపడి ఉంటాం

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వడ్డెర్లకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారని వడ్డెర్ల సంఘం నాయకుడు దేవరాజు తెలిపారు. ఎమ్మెల్యేల కోటా ద్వారా జయమంగళ వెంకటరమణ, ఏసురత్నంలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉంటామన్నారు.

నేడు చింత ఫలసాయం వేలం

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని చింత ఫలసాయాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు మోరుబాగల్ గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పెనుకొండ: పట్టణంలోని శివసాయి మందిరంలో బుధవారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 26 వరకు 5 రోజుల పాటు నిరవధికంగా వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. చెవి, ముక్కు, గొంతు, చర్మ సంబంధమైన వ్యాధులకు ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తామన్నారు. వినికిడి లోపం ఉన్న వారు ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందన్నారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు

మడకశిర: గుడిబండ మండలంలోని హిరేతుర్పిలో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుంచి ప్రారంభమవుతాయని ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, తిమ్మప్పస్వామి సంయుక్త ప్రకటనలో తెలిపారు. 25న కల్యాణోత్సవం, 26న బ్రహ్మరథోత్సవం, 27న ఉట్ల పరుష నిర్వహించనున్నామన్నారు.

'పది'లో సత్తా చాటాలి



విద్యార్థినులకు జ్ఞాపికలను అందించిన దృశ్యం

పావగడ: పదో తరగతి పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటాలని కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి పాఠశాల హెచ్‌ఎం ముత్తురాజు విద్యార్థినులకు సూచించారు. తాలూకాలోని చిక్కహళ్లిలోని ఆ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ బాగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు మారుతీశ్, సోమశేఖర్, రాజకుమార్, నరసింహమూర్తి, తిప్పేస్వామి, లత సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చేపల చెరువు వేలం

మడకశిర(అగళి): మండలంలోని ఇనగలూరు చెరువులో చేపల పెంపకానికి గురువారం బహిరంగ వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శి ఫణిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇనగలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు, ఈఓఆర్‌డీ సమక్షంలో ఈవేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం హిందూపురం పట్టణంతో పాటు లేపాక్షిలో జోరుగా ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి ఆధ్వర్యంలో పలు పాఠశాలలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలను అందజేశారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

లేపాక్షిలో...

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

రొద్దంలో రేపు....

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ భవనంలో గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలన్నారు.

24న సోమందేపల్లిలో...

సోమందేపల్లి : మండల కేంద్రమైన సోమందేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, వాల్మీకి రాష్ట్ర నాయకులు పొగాకు రామచంద్రకు సూచించారు. మంగళవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులు కలిశారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మంచి మెజార్టీతో గెలిపించడానికి శాయశక్తులా కృషిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు నాయకులు తెలిపారు.

సజ్జలను కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి

పెనుకొండ: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం తాడేపల్లిలో ఎమ్మెల్సీ అభ్యర్థి మంగమ్మ, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చినందుకు మంగమ్మ... సజ్జలకు కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, మాజీ ఎంపీ గంగాధర్ సోదరుడు సానిపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర వాల్మీకి నాయకులు పొగాకు రామచంద్ర, నాయకులు సత్యనారాయణ, నరసప్ప, వెంకటరాముడు, గుట్టూరు నారాయణస్వామి తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

అమరాపురం: గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ సుధాకర ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం కార్యదర్శులు సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

నేడు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్

హిందూపురం టౌన్: నెహ్రూ యువ కేంద్రం, జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువత పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కల్వర్టు వద్ద ఇరుక్కుపోయిన సిమెంట్ లారీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం సమీపంలో మడకశిర వైపు వస్తున్న సిమెంట్ లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో కల్వర్టును ఢీకొంది. కల్వర్టు నుంచి కొద్దిగా ముందుకు వచ్చి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదన్నారు. సిమెంట్ బస్తాలు దింపి జేసీబీతో లారీని బయటికి తీసే ప్రయత్నం చేస్తున్నారు.

పనులు వేగవంతం చేయండి

మడకశిరరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న నాడు - నేడు పనులను వేగవంతం చేయాలని సీఎంఓ ఓబుళపతి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ భాస్కర్‌తో నాడు-నేడు పనులపై చర్చించి ప్రగతిని తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు, సలహాలిచ్చారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు హరికృష్ణ

చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ పెద్దనపల్లికి చెందిన హరికృష్ణ (19) కడుపునొప్పిని తాళలేక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాల లబ్ధిని వివరించండి

- గృహసారథుల శిక్షణలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ గృహసారథులకు సూచించారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మున్సిపాల్టీ పరిధిలోని 30 నుంచి 38 వార్డులకు సంబంధించిన గృహసారథుల శిక్షణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీతో పాటు మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమ కోసం సీఎం జగన్ నవరత్నాల పథకాలను పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. గృహ సారథులు బ్యాడ్జీలు ధరించి కేటాయించిన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల పొందిన లబ్ధిని తెలియజేయాలన్నారు. అలాగే అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాలు వర్తించేలా కృషిచేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

టీడీపీ హయాంలో దోపిడీ

టీడీపీ ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీలదే పెత్తనమని వారికి లంచాలు ఇవ్వనిదే, వారి సిఫార్సులు లేనిదే కనీసం రేషన్‌కార్డు, పింఛన్ కూడా అందే పరిస్థితి ఉండేదని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నాడు-నేడు వ్యాత్యాసన్ని ప్రజలకు వివరించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో దోపిడీ, దౌర్జన్యాలతో పాటు వారం వారం పోలవరం, అమరావతి అంటూ జేబులు నింపుకున్నారని మండిపడ్డారు. బీసీ, ఎస్సీలకు చంద్రబాబు చూసిన తీరు గుర్తు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు జయరాముడు, అయుబ్, మల్లికార్జున, ముస్తక్, చిన్నమ్మ, నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకుల్లో తనిఖీ



పెట్రోల్‌బంక్‌లో తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

గోరంట్ల: మండల కేంద్రంలో ఉన్న ఆదిత్య పెట్రోల్‌బంక్‌ను మంగళవారం తహసీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్, డీజిల్ శ్యాంపిల్ తీసుకున్నారు. అదే విధంగా కొలతలు చెక్ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని మూడు పెట్రోలు బంకులను మంగళవారం అధికారులు తనిఖీలు చేశారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, తూనికల కొలతల అధికారి శివశంకర్, సీఎస్‌డీటీ హారతి తదితర అధికారులు కొడిగెనహళ్లి, మోదా, పరిగి పెట్రోలు బంకులను పర్యవేక్షించి, శాంపుల్‌ను సేకరించి, నిర్వహణ రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు మాట్లాడుతూ కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ కార్తీక్



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

గుడిబండ: పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై మండల పరిధిలోని పిల్లెనహళ్లి, శంకరగల్లు గ్రామాల్లో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన పైప్‌లైన్ పనుల కోసం భూములు కోల్పోయిన రైతులను గుర్తించి వారికి వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే రైతుల పట్టాదారు పాసుపుస్తకం, 1-బి సమస్యలు వెంటనే పరిష్కరించాన్నారు. అలాగే స్పందనలో వచ్చిన అర్జీలను పరిశీలించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగభూషణం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవి ఆలయంలో పూజలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కానుకల రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడి బియ్యం అమ్మవారికి కట్టి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

అగ్నికి ఆహుతైన గుడిసె

పావగడ: తాలూకాలోని భీమనకుంటెకు చెందిన రత్నమ్మ అనే మహిళకు చెందిన గుడిసె అగ్నికి ఆహుతైంది. సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో గుసెకు నిప్పంటుందని బాధితురాలు తెలిపారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం సంభవించిందని, గుడెసె పక్కనే ఉన్నవారికి చెందిన ద్విచక్ర వాహనం కూడా కాలిపోయిందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గోరంట్ల: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువుకి చెందిన హరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కేరేవాండ్లపల్లి క్రాస్ దగ్గర నిందితుడి దగ్గర నుంచి 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిని పెనుకొండ కోర్టులో హాజరుపర్చామన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



ముత్యాల పల్లకీలో ఊరేగుతున్న శివపార్వతులు

లేపాక్షి: మండల కేంద్రంలోని లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం అర్ధరాత్రి ముత్యాల పల్లకీలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆగమికులు సునీల్‌శర్మ పర్యవేక్షణలో వేదపండితులు శివపార్వతులకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తజన సందోహం మధ్య ముత్యాల పల్లకీ సేవ చేశారు. ఆలయం ముందు నుంచి ఆర్చ్ గేట్ మీదుగా ఎగువపేట, రాజవీధిల్లో ఊరేగింపు సాగింది. ఊరేగింపు మధ్యలో కీలు గుర్రాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు అభిషేకార్చనలు నిర్వహించి శివపార్వతులకు వసంతోత్సం నిర్వహించారు. దీంతో లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన సర్పంచ్ ఆదినారాయణ, రెవెన్యూశాఖ సిబ్బందికి ఈఓ నరసింహమూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చట్టసభల్లో అవకాశం కల్పించండి

హిందూపురం: నాయీ బ్రాహ్మణుల రాజ్యాధికార సాధనలో భాగంగా చట్టసభల్లో అవకాశం కల్పించాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎల్లనూరు ప్రసాద్ అన్నారు. మంగళవారం సవిత మహర్షి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను రాజకీయంగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్ నాయీ బ్రాహ్మణులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమం సంఘం గౌరవాధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు బీఎస్‌మూర్తి, కార్యదర్శి నాగేంద్రప్రసాద్, గోపి, రమేష్, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి



పెద్దీరప్ప (ఫైల్)

పావగడ: స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ పెద్దీరప్ప (77) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతునికి భార్య తిమ్మక్క, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దీరప్ప 1998-2001 కాలంలో కాంగ్రెస్ తరఫున మున్సిపల్ చైర్మన్ పనిచేశారు.పెద్దీరప్ప మృతి పట్ల ఎమ్మెల్యే వెంకటరమణప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ జీఎస్ ధర్మపాల్ సంతాపం తెలిపారు.

అనుమతి లేకుండా వైద్యం చేస్తే చర్యలు



రొళ్లలో ప్రైవేట్ క్లీనిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న

రొళ్ల: వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతి పొందకుండా ఆర్‌ఎంపీ వైద్యులు ప్రైవేట్ క్లీనిక్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు వైద్య సేవలు అందిస్తే చర్యలు తప్పవని హిందూపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న పేర్కొన్నారు. రొళ్ల పట్టణంలోని శనేశ్వరస్వామి ఆలయం వెనక ఓ గదిలో అనుమతి లేకుండా తిప్పేస్వామి అనే వ్యక్తి ప్రజలకు ప్రథమ చికిత్సతో పాటు ఔషధాలను విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో మంగళవారం తనిఖీ చేపట్టామని తెలిపారు. రికార్డులు పరిశీలించి అనుమతిలేని రూ.35 వేలు విలువ గల మందులు, ఔషధాలను సీజ్ చేశామన్నారు. అనంతరం గ్రామ వీఆర్వో వైకుంఠప్ప సమక్షంలో పంచనామా చేసి కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. అనుమతి లేకుండా క్లీనిక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రథమ చికిత్స ద్వారా వైద్య సేవలు చేయడం, మెడికల్ షాపులో నకిలీ, కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.